



EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
21-06-2025
పేజీలు: 02







## ప్రపంచానికి భారత్ అందించిన
# అమూల్యమైన బహుమతి యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 5,500 మంది విద్యార్థులు, యోగా శిక్షకులు, వైద్యులు, ప్రజలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సినీ నటులైన సాయి ధరమ్ తేజ్, తేజ సజ్జ, మీనాక్షి చౌదరి, ఖుష్బూ వంటి ప్రముఖులు ఈ వేడుకలకు హాజరై యోగాసనాలు వేశారు.ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ గా నిర్ణయించారు. ఈ థీమ్ యోగా ద్వారా ప్రకృతి, మానవ ఆరోగ్యం మధ్య సమతుల్యతను సాధించాలనే సందేశాన్ని అందిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యోగా శిక్షకులు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వృక్షాసనం వంటి యోగాసనాలు చేశారు. ఈ ఆసనాలు ఒత్తిడిని తగ్గించడం, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయని నిపుణులు వివరించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన బహుమతి అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఆనందదాయకమని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఐక్యరాజ్యసమితిలో యోగా దినోత్సవం ప్రతిపాదన చేయడం ద్వారా యోగాను ప్రపంచవ్యాప్తం చేశారని, ఇది భారతీయ సంస్కృతికి గర్వకారణమని పేర్కొన్నారు.






## యోగాకు సరిహద్దుల్లేవు...
# ప్రపంచాన్ని ఏకం చేసింది

యోగా మనల్ని నడిపిండంతో పాటు మనల్ని మేల్కొలుపుతుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విశాఖపట్నంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన ప్రధాని నరేంద్ర మోడీకి ఏపి సిఎం చంద్రబాబు నాయుడు జాపికను బహుకరించారు. యోగా చేసిన అనంతరం మోడీ ప్రసంగించారు. విశాఖపట్టణంలో యోగాంధ్ర ఈవెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏపి సర్కారుకు మోడీ అభినందనలు తెలియజేశారు. ప్రజల భాగస్వామ్యానికి ఇదొక స్ఫూర్తిగా నిలిచిందని, వికసిత్ భారత్ ఆలోచనలకు ఇది రూపమన్నారు. యోగా వ్యక్తిగత క్రమశిక్షణకు మారుపేరని, ప్రపంచ గమనాన్ని మార్చిందని, వన్‌ఎర్త్.. ఎన్ హెల్త్ థీమ్‌తో ఈసారి యోగా దినోత్సవాన్ని నిర్వహించామని తెలియజేశారు. యోగా ప్రక్రియతో చికిత్స చేసే విధానాన్ని ఢిల్లీ ఎయిమ్స్ అభివృద్ధి చేస్తోందని, యోగాను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రచారం ఎక్కువల కల్పించాలని పిలుపునిచ్చారు. యోగా గురించి మన్ కీ బాత్‌లో కూడా విస్తృతంగా చర్చించామని, రోజూ మనం తినే ఆహారంలో 10 శాతం నూనె తగ్గించాలని, సంతులిత జీవన శైలిని అలవాటు చేసుకోవాలని మోడీ సూచించారు. యోగాకు సరిహద్దుల్లేవు, వయసుతో పనిలేదని, ప్రకృతి, ప్రగతి సంగమం అని పేర్కొన్నారు. యోగా ప్రపంచాన్ని ఏకం చేసిందని, 175 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని ప్రశంసించారు. యోగా గ్లోబలైజ్ కావడం సామాన్యమైన విషయం కాదని, యోగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన శైలిని మార్చిందని మోడీ కొనియాడారు. అంతరిక్షంలో కూడా యోగా చేసిన ఘనత మనదేని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి లోకేష్, ప్రజలు హాజరయ్యారు.



### గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించిన విశాఖ యోగాంధ్ర కార్యక్రమం


అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయింది. ఒకే చోట 3 లక్షల మందితో నిర్వహించిన యోగాసనాల ప్రదర్శనతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు ఈ రికార్డు గుజరాత్‌లోని సూరత్ పేరిట ఉండగా, అక్కడ 1,47,952 మంది పాల్గొన్నారు. కానీ విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో లక్షలాది మంది ప్రజలు, విద్యార్థులు, యువత, వృద్ధులు, మహిళలు భాగస్వాములై, ఏకకాలంలో యోగాసనాలు చేసి ప్రపంచాన్ని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరై, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి సామాన్య ప్రజల మధ్య కలసిపోయి, వారితో పాటు యోగాసనాలు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. ప్రధాని, సీఎం సమక్షంలో గిన్నిస్ బుక్ అధికార ప్రతినిధులు ఈ రికార్డును ధృవీకరించి ప్రకటించారు.








## పారిస్ డైమండ్ లీగ్‌లో మెరిసిన
# నీరజ్ చోప్రా




భారత జావెలిన్ త్రో స్టార్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా మరోసారి తన సత్తా చాటాడు. పారిస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి, రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన తొలి డైమండ్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ విజయం నీరజ్‌కు, భారత అథ్లెటిక్స్‌కు ఎంతో కీలకమైనది.పారిస్ డైమండ్ లీగ్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్ చోప్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన తొలి ప్రయత్నంలోనే 88.16 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత రెండవ ప్రయత్నంలో 85.10 మీటర్లు విసిరాడు. అతని మూడవ, నాల్గవ, ఐదవ ప్రయత్నాలు ఫౌల్‌గా మారినప్పటికీ, చివరి ప్రయత్నంలో 82.89 మీటర్లు విసిరి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.ఈ పోటీలో నీరజ్ చోప్రా ప్రధాన ప్రత్యర్థులుగా భావించిన జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ 87.88 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, బ్రెజిల్‌కు చెందిన లూయిజ్ మారిసియో డా సిల్వా 86.62 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత రెండు టోర్నమెంట్లలో (దోహా డైమండ్ లీగ్ 2025, పోలాండ్ ఈవెంట్) జూలియన్ వెబర్ చేతిలో ఓడిపోయిన నీరజ్, ఈసారి ప్రతీకారం తీర్చుకున్నాడు. దోహాలో నీరజ్ 90.23 మీటర్లు విసిరినప్పటికీ, వెబర్ 91.06 మీటర్లతో విజయం సాధించాడు. అయితే, ఈ పారిస్ డైమండ్ లీగ్‌లో నీరజ్ వెబర్‌ను అధిగమించడం ఎంతో సంతృప్తినిచ్చింది.



# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో వరంగల్ సుబేదారీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను వరంగల్ కు తరలించారు. కమలాపూర్ మండలంలో గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 308(2), 308(4), 352 కింద కేసులు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మనోజ్ రెడ్డి అనే వ్యక్తి కమలాపూర్ మండలంలోని వంగపల్లిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తనను రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించినట్లు మనోజ్ రెడ్డి భార్య ఉమాదేవి సుబేదారీ పీఎస్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సుబేదారీ పోలీసులు శనివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో అదుపులోకి తీసుకున్నారు.

### అందుకే కౌశిక్ రెడ్డి అరెస్టు.. ఖండించిన కెటిఆర్

బిఆర్ఎస్ ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమాలు, మంత్రుల అవినీతిపై కౌశిక్ రెడ్డి ప్రశ్నించడంతో ఆయనను అరెస్టు చేశారని దుయ్యబట్టారు. సిఎం రేవంత్ రెడ్డి నిరంకుశ వైఖరి మంచిది కాదని హితువు పలికారు. తప్పుడు కేసులతో బిఆర్ఎస్ నేతల మనోధైర్యం దెబ్బతీయలేరని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి దారుణాలకు పాల్పడుతోందని కెటిఆర్ విమర్శలు గుప్పించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా కోర్టుల్లో నిలబడే అవకాశం లేదన్నారు. బిఆర్ఎస్ నేతలపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా కూడా ప్రజల తరపున పోరాటం చేస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు.



# దెయ్యాలను నేను పెళ్లాడను

తెలుగులో రెండుమూడేళ్ల క్రితమే ఆఫర్లు వచ్చినా.. సాలిడ్ ఎంట్రీ కోసం ఇన్నాళ్లూ ఆలస్యం చేస్తూ వచ్చింది మలయాళమందారం మాళవిక మోహనన్. ఎట్టకేలకు ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'ది రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నది ఈ అందాలభామ. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే మాళవిక మోహనన్.. తన అందమైన ఫొటోలను ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఆ ఫొటోలను చూసిన అభిమానులు రొమాంటిగ్గా స్పందిస్తుంటారు.అందుకే 'దెయ్యాలను నేను పెళ్లాడను' అంటూ ఫన్నీగా స్పందించింది మాళవిక మోహనన్. ఇలా అందమైన ఫొటోలను పోస్ట్ చేయడం, ఆ ఫొటోలను చూ సి ఫిదా అయిన అభిమానులు ఆమెకు 'ఐలవ్యూ' అంటూ కామెం ట్లు పెట్టడం ఆ కామెంట్లకు మాళవిక సరదాగా స్పందించడం ఇవన్నీ మామూలే.



## ‘మహిళలు పువ్వు లాంటివారు’.. వైరలవుతున్న ఖమేనీ పాత పోస్టులు..!

ఇరాన్ – ఇజ్రాయేల్ మధ్య యుద్ధం రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇరుదేశాల సైన్యం బాలిస్టిక్ క్షిపణులతో దాడులకు తెగబడుతుండడంతో రెండు దేశాల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఇరాన్ మతగురువు, అగ్రనేత అయతుల్లా అలీ ఖమేనీని అంతమొందిస్తామని ఇజ్రాయేల్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఖమేనీ పాత పోస్టులు నెట్టింట వైరలవుతున్నాయి. గతంలో ఆయన మహిళల గురించి, పేదరికం గురించి.. స్కూల్ డేస్ గురించి.. నల్లజాతీయులకు మద్దతుగా ఆయన పెట్టిన పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి.ఇజ్రాయేల్‌తో యుద్ధం ఆగేదిలేదంటున్న ఖమేనీ.. అప్పట్లో పెట్టిన ఈ పోస్టులు చూసిన చాలామంది ఆయన భిన్న వైఖరికి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ అధ్యక్షుడిగా 1981లో సేవలందించిన ఖమేనీ ప్రజాకర్షణ కలిగిన నేత. మతగురువుగానూ పేరు, ప్రఖ్యాతలు సంపాదించిన ఆయన గతంలో మహిళలు పువ్వు లాంటివారని అభిప్రాయపడ్డారు. 2013 సెప్టెంబర్ 16న ఒక పోస్ట్‌లో.. ‘మహిళల అవసరాలు, వాళ్ల ఫీలింగ్స్‌ను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత పురుషుల మీద ఉంది. మహిళల భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదు’ అని ఖమేనీ రాసుకొచ్చారు. ‘పురుషుల కంటే మహిళలు చాలా శక్తిమంతులు. వాళ్లు తమ తెలివితేటలు, దౌత్య నైపుణ్యంతో పురుషులను నియంత్రించడమే కాదు ప్రభావితం చేయగలరు కూడా’ అని 2015 ఫిబ్రవరి 25 న ఆయన పెట్టిన పోస్ట్‌లోని సారాంశం.



## నోబెల్ శాంతి పురస్కారానికి ట్రంప్‌ను నామినేట్ చేసిన పాక్ ప్రభుత్వం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ అయ్యారు. పాకిస్థాన్ ప్రభుత్వం ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఇటీవలే తలెత్తిన ఘర్షణల సమయంలో ట్రంప్ దౌత్యపరంగా జోక్యం చేసుకుని కీలకంగా వ్యవహరించారని, ఆయన నాయకత్వానికి గుర్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాకిస్థాన్ ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ట్రంప్‌పై ప్రశంసలు కురిపించింది. ట్రంప్‌ను నిజమైన శాంతి నిర్మాతగా అభివర్ణించింది. కాగా, ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఈ విశిష్ట పురస్కారానికి నామినేట్ అయినప్పటికీ ఒక్కసారి కూడా బహుమతిని గెలుచుకోలేకపోయారు.




## సితారే జమీన్ పర్ రివ్యూ

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ ప్రొడక్షన్ హౌజ్ నుంచి వచ్చిన ‘తారే జమీన్ పర్’ ఎలాంటి ఘన విజయాన్ని అందుకుందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘సితారే జమీన్ పర్’ అంటూ మరో ఎమోషనల్ రైడ్ చిత్రాన్ని మనముందుకు తీసుకొచ్చాడు అమీర్ ఖాన్. నేడు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయిన ఈ సినిమా ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుందో ఈ రివ్యూలో చూద్దాం. గుల్షన్ అరోరా(అమీర్ ఖాన్) ఢిల్లీ బాస్కెట్ బాల్ టీమ్‌కు అసిస్టెంట్ కోచ్. అయితే, అతడి షార్ట్ టెంపర్ తదితర అలవాట్లు అతడిని పలు ఇబ్బందుల్లో పడేస్తాయి. దీంతో ఓరోజు మద్యం సేవించి వాహనం నడిపి పోలీసులకు దొరికిపోయిన గుల్షన్ అరోరాకు కోర్టు జడ్జి మానసిక దివ్యాంగుల జట్టుకు బాస్కెట్ బాల్ కోచ్‌గా పనిచేయాలని శిక్షిస్తుంది. దీంతో మానసిక దివ్యాంగుల జట్టుకు అమీర్ ఖాన్ ట్రైనింగ్ ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటాడు..? అతడికి తన భార్య జెనీలియాతో ఎలాంటి సమస్య ఉంటుంది..? ఈ క్రమంలో అతడికి ఎలాంటి నిజాలు తెలుస్తాయి..? చివరికి ఈ జట్టుతో అతను ఏం సాధిస్తాడు..? అనేది సినిమా కథ. ‘తారే జమీన్ పర్’ సినిమా చూసిన వారికి ‘సితారే జమీన్ పర్’ కథ పెద్దగా తేడా ఏమీ అనిపించకపోవచ్చు. కానీ, అందులోని ఎమోషన్స్, ఇందులోని ఎమోషన్స్‌లో చాలా తేడా ఉంటుంది. డౌన్ సిండ్రోమ్, మానసిక పరిపక్వత లేకపోవడం వంటి వారు తామ అనుకుంటే ఎలాంటి విజయాలను అయినా అందుకుంటారు అనే అంశాన్ని చాలా చక్కగా ప్రెజెంట్ చేశారు. ఫస్టాఫ్‌లో కథను చాలా ఫాస్ట్‌గా ముందుకు తీసుకెళ్లిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే, ఆ తర్వాత దర్శకుడు కొంతమేర ట్రాక్ తప్పినట్లుగా అనిపిస్తుంది. ఓ శిక్ష కారణంగా బాస్కెట్ బాల్ కోచ్‌గా వచ్చిన హీరో, మానసిక దివ్యాంగులతో ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటాడు అనేది చక్కగా చూపెట్టారు. ఇక తన జట్టును ఎలాగైనా గెలిపించాలనే కోచ్ పాత్రలో అమీర్ ఖాన్ పర్ఫార్మెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

అతని భార్య సునీత(జెనీలియా)తో అతనికి ఉండే మనస్పర్థలు ఏ విధంగా తొలగిపోతాయనేది కూడా చక్క.గా చూపించారు. ఇక ఈ క్రమంలో వచ్చే క్లైమాక్స్ ఎపిసోడ్ చాలా ఎమోషనల్‌గా ఉండటమే కాకుండా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ‘తారే జమీన్ పర్’ లాంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని వీక్షించిన ప్రేక్షకులు, ఈ ‘సితారే జమీన్ పర్’ కథ చాలా ఫ్లాట్‌గా అనిపిస్తుంది. కథలో మంచి ఎమోషనల్ కంటెంట్ ఉన్నప్పటికీ అది ప్రేక్షకులను పూర్తిగా ప్రభావితం చేసేలా వినియోగించుకోలేకపోయారు. ఇలాంటి సినిమాల్లో ఎంటర్‌టైన్మెంట్‌కు పెద్దపీట వేయాల్సిన అవసరం లేదు. కానీ, ఎమోషన్స్‌ను ఏ కోసాన కూడా మిస్ కాకుండా చూసుకోవాలి. అయితే, కథలోని పాత్రలకు సంబంధించిన గతాన్ని చాలా తేలికగా తీసుకున్నట్లు మనకు చూపెడతారు. అటు హీరో వారితో ప్రవర్తించే తీరు కూడా మనకు ఏమాత్రం కనెక్ట్ కాదు. కేవలం క్లైమాక్స్‌లోనే హీరోకు వారితో బంధం ఏర్పడుతుందనే పాయింట్ ప్రేక్షకులను మెప్పించదు. మధ్యలో వచ్చే హీరో అతడి భార్య.. అతడి తల్లి ఎపిసోడ్స్ సినిమాను ల్యాగ్ చేసినట్లు అనిపిస్తాయి. దర్శకుడు ఆర్.ఎస్.ప్రసన్న ఇలాంటి ఎమోషనల్ కంటెంట్‌ను హ్యాండిల్ చేసిన తీరు బాగుంది. అయితే, ఆయన ఈ చిత్ర స్క్రీన్‌ప్లే, కొన్ని ల్యాగ్ సీన్స్‌పై మరింత ఫోకస్ పెట్టాల్సింది. సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. సంగీతం పరంగా వచ్చే పాటలు పర్వాలేదనిపిస్తాయి. ఎడిటింగ్ విషయంలో ఇంకాస్త జాగ్రత్తలు తీసుకోవాల్సింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. ఓవరాల్‌గా చూస్తే.. ‘సితారే జమీన్ పర్’ చిత్రం ఓ చక్కటి ఎమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పించిందని చెప్పాలి. బలమైన ఎమోషన్స్, చక్కటి పర్ఫార్మెన్స్‌లతో ఈ సినిమా ఆకట్టుకుంది. అయితే, ‘తారే జమీన్ పర్’ సినిమాను చూసి అదే తరహా అంచనాలతో ఈ సినిమాకు వెళ్తే, వారికి పెద్దగా నచ్చకపోవచ్చు. ఎమోషనల్ కంటెంట్ చిత్రాలు ఇష్టపడే వారిని ‘సితారే జమీన్ పర్’ ఆకట్టుకుంటుంది.




## జూలై 24న హరిహర వీరమల్లు


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లాంగ్ అవైటెడ్ చిత్రమే ‘‘హరిహర వీరమల్లు’’. తన నుంచి ఒక భారీ హిస్టారికల్ చిత్రంగా అనౌన్స్ చేసినపుడు సాలిడ్ హైప్ ఈ సినిమాపై నెలకొంది. కానీ సినిమా అంతకంతకూ ఆలస్యం అవుతూ రావడం లాస్ట్ మినిట్ కూడా వాయిదా పడుతుండడం అనేది మాత్రం ఫ్యాన్స్ కి బాగా ఇబ్బందిగా మారింది. అయితే ఎట్టకేలకి హరిహర వీరమల్లు తాలూకా ఫైనల్ రిలీజ్ డేట్ వచ్చేసింది. మేకర్స్ ఈ చిత్రాన్ని లీసెంట్ గా వినిపిస్తున్న డేట్ జూలై 24 కే థియేటర్స్ లో వస్తున్నట్టుగా సాలిడ్ పోస్టర్ ని పవన్ కళ్యాణ్ సహా నటుడు బాబీ డియోల్ పై డిజైన్ చేసిన దానితో రిలీజ్ చేసేసారు. సో మొత్తానికి వీర ఆగమనం ఈ డేట్ లో ఉండనుంది అని చెప్పాలి. ఇంకా నెల రోజుల సమయంలో సినిమాకి పోయిన హైప్ ని మేకర్స్ మళ్ళీ తెచ్చుకుంటారా లేదా అనేది చూడాలి.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపై బండి సంచలన వ్యాఖ్యలు



ఫోన్ ట్యాపింగ్ కేసుపై బిజెపి ఎంపి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని తానే ముందు చెప్పానని, హైదరాబాద్-సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రావు చాలామంది సంసారాలు నాశనం చేశారని, ప్రభాకర్, రాధాకిషన్ చాలామంది ఉసురుపోసుకున్నారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే తనని కూడా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్‌రావును కాపాడే ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్ కు నోటీసులు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కెసిఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలో ఫోన్ మాట్లాడాలంటేనే భయపడేవాళ్లమన్నారు. ఫేస్ టైం, సిగ్నల్ యాప్‌లలోనే ఫోన్ మాట్లాడుకున్నామని తెలియజేశారు. కెటిఆర్ తో మాట్లాడిన తర్వాతే ప్రభాకర్ భారత్ వచ్చారని, తాను సిట్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇస్తానని బండి స్పష్టం చేశారు.

## శతకంతో విరుచుకుపడిన గిల్.. నాలుగో కెప్టెన్‌గా రికార్డు



ఇంగ్లండ్ గడ్డపై సవాళ్లు, సందేహాల నడమ టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్(118 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఇంగ్లండ్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ శతకంతో విరుచుకుపడ్డాడు. 56 బంతుల్లో 8 ఫోర్లతో ఫిఫ్టీ బాదిన గిల్.. ఆ తర్వాత ధనాధన్ ఆడాడు. జోష్ టంగ్ ఓవర్లో బౌండరీతో మూడంకెల స్కోర్ అందుకున్నాడు. దాంతో, కెప్టెన్‌గా ఆడుతున్న తొలి ఇన్నింగ్స్‌లోనే వంద కొట్టిన నాలుగో భారత క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడీ యంగ్‌స్టర్. హెడింగ్లేలో చిరస్మరణీయ సెంచరీ బాదిన అతడు విజయ్ హజారే, సునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీల సరసన చేరాడు. హెడింగ్లే టెస్టులో భారత జట్టు పట్టుబిగించే దిశగా సాగుతోంది. టాస్ ఓడిన టీమిండియాకు ఓపెనర్లు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(101), కేఎల్ రాహుల్ (42) శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించి ఇంగ్లండ్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. తొలి సెషన్‌లో చెలరేగి ఆడిన ద్వయాన్ని బ్రాండన్ కర్సే విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(0) స్టోక్స్ వెనక్కి పంపాడు. సాయి వెనుదిరిగాక యశస్వీ జతగా గిల్ జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. బౌండరీలతో ఇంగ్లండ్ బౌలర్లను పరుగులు పెట్టించిన ఈ జోడీ మూడో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. ఐదో సెంచరీ బాదిన యశస్వీని టీ సెషన్ తర్వాత స్టోక్స్ బౌల్డ్ చేశాడు. ప్రస్తుతం రిషభ్ పంత్(48 నాటౌట్), గిల్ నాలుగో వికెట్‌కు 110 రన్స్ చేసి.. స్టోక్స్ సేనను డీలా పడేలా చేశారు.

## ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని గుర్తు చేస్తున్న రేవంత్

పాలన గాలికి వదిలేసి, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రైతుల నుంచి ప్రజా ప్రతినిధుల వరకు కేసుల పేరుతో అందరినీ వేధిస్తూ రాక్షసానందం పొందుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకునే రేవంత్, ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని గుర్తు చేస్తున్నడని మండిపడ్డారు. కేసులు, అరెస్టులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవన్నారు. మీ వైఫల్యాలను నిలదీస్తామని, నమ్మించి నయవంచన చేసిన మీ మోస పూరిత వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని స్పష్టం చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన కౌశిక్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్బంగా జింఖానా గ్రౌండ్స్‌లో స్కేటింగ్‌తో యోగా ఆసనాలు!

కాలానికి ఒక సృజనాత్మక విధానం - శరీర సమతుల్యత, వ్యాయామం, మనస్సు మరియు శరీర సమన్వయం, జీవనశైలి మరియు ఫిట్‌నెస్ యొక్క శాశ్వత భారతీయ కళ - యోగా - సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్ స్కేటింగ్ రింక్‌లో అర్జున అవార్డు గ్రహీత అనుప్ కుమార్ యమ శిక్షణ పొందిన హైదరాబాద్ యువ స్కేటర్లతో స్కేట్స్‌నుప్రారంభించారు. ఈ కార్యక్రమమం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ VC & MD శ్రీమతి సోని బాలా దేవి కలిసి ఎన్ సుధాకర్ రావు DYSO హైదరాబాద్, నిర్వహించారు. యోగా మరియు స్పోర్ట్ స్కేటింగ్ యొక్క చక్కటి సమ్మేళనం పైన పేర్కొన్న రెండు కళల యొక్క సహజ లక్షణాలతో రూపుదిద్దుకుంటుంది, ఇక్కడ శరీర సమతుల్యత, మనస్సు మరియు శరీర సమన్వయం, ఫిట్‌నెస్ మరియు వశ్యత వెదజల్లుతాయి, శరీరంలోని ప్రతి భాగాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటాయి. ఆధునిక స్కేటింగ్ కళతో కలిసిన యోగా కళ నేడు అత్యున్నత స్థాయిలో కళల సహకారాన్ని ప్రదర్శిస్తుంది.

## బ్రేకప్ స్టోరీ



తెలుగమ్మాయి అనన్య నాగళ్ల మంచి నటి మాత్రమే కాదు, మంచి మనసున్న అమ్మాయి కూడా. తన సంపాదనలో ఎంతో కొంత చారిటీలకే ఖర్చు చేస్తూవుంటుంది. మల్లేశం, వకీల్‌సాబ్, పొట్టేల్ చిత్రాల ద్వారా టాలీవుడ్‌లో తనకంటూ ఓ గుర్తింపును సాధించింది అనన్య నాగళ్ల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తొలిప్రేమ బ్రేకప్ విశేషాలను అనన్య నాగళ్ల పంచుకున్నది. ‘కెరీర్‌లో పొగడ్తలు, తెగడ్తలు సహజం. అన్నింటినీ అలవాటు చేసుకున్నా.కానీ వ్యక్తిగత జీవితంలో ప్రేమ విఫలమైనప్పుడు మాత్రం బాధ భరించలేకపోయా. నేను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన కొంత కాలానికే నాకు బ్రేకప్ అయ్యింది. రెండేళ్ల పాటు మనసులో ముల్లులా ఆ బాధ గుచ్చుకుంటూనే ఉంది. అయితే.. వర్క్‌పై మాత్రం ఆ ప్రభావం పడనిచ్చేదాన్ని కాదు. రాత్రంతా ఏడ్చేదాన్ని. ఉదయాన్నే జిమ్‌కెళ్లిపోయేదాన్ని. షూటింగ్ టైమ్‌లో కారవాన్‌లో ఏడ్చేదాన్ని. షాట్ అవ్వగానే ఏం జరగనట్టు బయటకొచ్చేదాన్ని. ఈ విషయం ఇప్పటివరకూ ఇంట్లోవాళ్లకు కూడా తెలియదు. స్నేహితులకు మాత్రమే తెలుసు.’ అంటూ చెప్పుకొచ్చింది అనన్య నాగళ్ల.